క్లుప్తంగా

ఘనంగా ఇటుకల పండగ



చౌడుపల్లిలో తాచేరు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

చింతపల్లిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటుకల పండగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. పండగలో భాగంగా గిరిజన మహిళలు ప్రధాన రహదారుల వద్ద వాహనచోదకుల నుంచి తాచేరు వసూలు చేశారు. ఈ పండుగ వారం రోజులు పాటు జరుపుకుంటారు. అనంతరం పురుషులు అడవికి వేటకు వెళ్లి తెచ్చిన వాటితో వనభోజనాలు ఏర్పాటు చేసుకుంటారు.

భీమేశ్వర పాలేశ్వర స్వామి ఆలయంలో పూజలు

మునగపాక : మునగపాక పంచాయతీ వీధిలోని భీమేశ్వర పాలేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 23న ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణం ఘనంగా జరపనున్నారు. ఈ మేరకు శనివారం రాట మహోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

అనంతగిరి: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనంతగిరి పశువైద్యాధికారి సందీప్ తెలిపారు. మండలంలోని టోకూరు, కొండిబ గ్రామాల్లో బంగారమ్మవలస, తెంతెలిగుడ, ములియగుడ, సీసాగుడ, లింబగుడ, మువ్వంవలస గ్రామాల్లో శనివారం పశువులకు జబ్బువాపు టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఏహెచ్ఏలు నవీన్, మోహన్,అనిల్, అప్పారావు, దిలీప్, రామ్మూర్తి, శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తాళాలు అప్పగించాలి

- ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా గల పాఠశాల భవనాలకు చెందిన తాళాలను అప్పగించాలని ఎంపీడీవో ఎల్. యాదగిరీశ్వరరావు హెచ్ఎంలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో 23న తేదీన పాఠశాలల తాళాలను స్థానిక విద్యాశాఖాధికారికి హెచ్ఎంలు అందజేయాలని కోరారు. ఎంఈవో అందుబాటులో ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో తాగునీరు, టాయ్‌లెట్స్ తదితర అన్ని సదుపాయాలు కల్పించామన్నారు.

పాఠశాల భవన మరమ్మతుకు కృషి



ఈదురుగాలులకు దెబ్బతిన్న పాఠశాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి నర్సింహమూర్తి

అరకులోయ రూరల్: మండలంలో బస్కి పంచాయతీలో ఈదురుగాలులకు కొరగుడ మండల పరిషత్ పాఠశాల పాఠశాల భవనంపై కప్పు రేకులు దెబ్బతిన్నాయి. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈదురుగాలులతో భవనం పైకప్పు రేకులు దెబ్బతిన్నాయన్నారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పైకప్పు మరమ్మతు పనులు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.



సమస్యలకు మోక్షం

- దిబ్బపాలెం– పెదకోట రహదారికి మోక్షం
- పినకోట, పెదకోట, జీనబాడు, కివర్ల గ్రామస్తుల కల సాకారం
- 70 గ్రామాలకు మార్గం సుగమం
- అందుటులో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల సేవలు
- ఆనందంలో గిరిజనులు



గోతులమయంగా పినకోట- పెదకోట రహదారి (నాడు)



పినకోట-పెదకోట రోడ్డు (నేడు)

అనంతగిరి: టీడీపీ ప్రభుత్వ హయాంలో దిబ్బపాలెం మార్గం పెద్దపెద్ద గోతులు..వర్షం పడితే చిత్తడి దారులతో దర్శనమిచ్చేది..రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం మన్యంలో ఏ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. అన్ని పంచాయతీల్లో సమస్యలు తాండవించేవి.. నాడు టీడీపీ యంత్రాంగం, పాలకులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై కనీసం పట్టించుకోకపోవడంతో గిరిజనులు పడిన అవస్థలు వర్ణనాతీతం. గ్రామాలకు సరైన రహదారులు లేక అత్యవసర సేవలు అందేవి కావు..అవసరమైన వేళల్లో 108, అంబులెన్స్ సేవలందక రోగులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. పెద్ద పెద్ద గోతులతో రహదారులుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యే వారు. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించలేదు. అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన ప్రాంతం రూపురేఖలు మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించారు. మన్య ప్రాంతంలోని శివారు గ్రామాలు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాభివృద్ధితో పాటు తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. జగనన్న వెంటే ఉంటామని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మార్గం..సుగమం

మండలంలోని మారుమూల పినకోట, పెదకోట రహదారి మరమ్మతు పనులతో మార్గం సుగమమైంది. పదేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలను కలుపుకుంటూ జాలడ గ్రామం వరకు విడతల వారీగా ట్రైబల్ వెల్ఫేర్‌లో సుమారు రూ.6కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఏళ్ల సమస్య పరిష్కారం కావడంతో నలుగు పంచాయతీల గిరిజనులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అయితే నిర్వహణ లేకపోవడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. వర్షాలకు పూర్తిగా గోతులమయంగా మారడంతో ప్రయాణాలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రహదారి ఆర్అండ్‌బీశాఖ పరిధిలోకి రావడంతో మోక్షం కలిగింది. మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో అధ్వానంగా ఉన్న దారి అద్దంలా మారింది. దీంతో రాకపోకలకు గిరిజనులు మార్గం సుగమమైంది.

- జీనబాడులో రూ.45లక్షలతో సచివాలయం, ఆర్‌బీకే రూ.21లక్షలతో, రూ.22లక్షతో వెల్‌నెస్ సెంటర్ పూర్తి
- పినకోట పంచాయ తీరూ.45లక్షలో సచివయం పూర్తి, రూ.21లక్షలతో ఆర్‌బీకే పనులుజరుగుతున్నాయి.
- పెదకోట పంచాయతీ సచివాలయం, ఆర్‌బీకే రూ.21లక్షలతో, రూ.22లక్షతో వెల్‌నెస్ సెంటర్ పనులు జరుగుతున్నాయి.
- పినకోట పంచాయతీలోని 12 గ్రామాలకు ఇంటింటికీ కుళాయి పనులు చేశారు.

నిధుల మంజూరు

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట పంచాయతీలకు వెళ్లేందుకు రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. అడుక్కో గొయ్యి ఏర్పడి, రహదారి ప్రమాదభరితంగా మారింది. దీంతో గిరిజనులు ప్రమాదాలకు గురైయ్యేవారు. మొదటి విడతగా ఆర్అండ్‌బీశాఖ దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు 5.8 కిల మీటర్లకు గాను, రూ.1.50కోట్లతో గత ఐదునెలల క్రితం మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో పినకోట, పెదకోట వరకు మార్గం సుగమమైంది. పెదకోట నుంచి కివర్ల పంచాయతీ జాలడ వరకు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. దిబ్బపాలెం నుంచి జీనబాడు వరకు సుమారు రూ.10 లక్షలతో మరమ్మతు పనులకు సంబంధించి ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో టెండర్ సంబంధించి పిలవలేదు.

శరవేగంగా అభివృద్ధి

నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యలతో గిరిజనులు సతమతమయ్యేవారు. టీడీపీ పాలకులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. గోతుల రహదారులతో సతమతమయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రహదారులకు మోక్షం కలిగింది. గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతోంది. జగనన్న ప్రభుత్వం పంచాయతీలో ఆర్‌బీకే, గ్రామ సచివాలయం నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల పనులకు కోట్లాది రూపాయలను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

– గణేష్, పినకోట

జగనన్నకు రుణపడి ఉంటాం

రహదారు అందుబాటులో రావడంతో మా ప్రయాణానికి ఇబ్బందులు తప్పాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జీనబాడు నుంచి కివర్ల వరకు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. పెద్ద గోతులు ఉండేవి. తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడేవారు. వర్షం పడితే ప్రయాణం నరకయాతన ఉండేది. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. సమస్యలతో సతమతమయ్యేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో రహదారులు బాగుపడడంతో రవాణా మెరుగైంది. గ్రామాల్లో సమస్యలు పరిష్కారమయ్యాయి. సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– రాజు, పినకోట గ్రామస్తుడు



జీనబాడులో రోడ్డుకు మరమ్మతు పనులు



జీనబాడులో గ్రామ సచివాలయం



జీనబాడులో రైతు భరోసా కేంద్రం

జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టండి



గ్రామస్తులతో పెనకోట, పెదకోట సర్పంచులు గణేష్, అన్నపూర్ణ, నేతలు



చింతరేగుబల్లిలో జైజగనన్న అంటూ నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు, గ్రామస్తులు

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు వారపు సంతలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి జగనన్న ప్రభుత్వానికి పట్టడం కడదామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరుచేశారని, గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థిగా తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా రేగం మత్స్యలింగంను గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. చంద్రబాబు మోసపూరిత మాటలను నమ్మవద్దన్నారు. సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ, ఆనంద్‌కుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాసి, నాయకులు కొండలరావు, బాలరాజు, రామ్మూర్తి, రఘునాథ్, శ్రీరాం, నొబో తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని పినకోట, పెదకోట పంచాయతీల్లో సర్పంచులు సిరగం గణేష్, సిరగం అన్నపూర్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జగబంధు, నాయకులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి ప్రచార రథాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్న పార్టీ శ్రేణులకు ప్రచార రథం రాకతో మరింత ఉత్సాహం నింపినట్టు అవుతుందన్నారు. నాయకులు జయదేవ్, సన్యాసిరావు, అప్పారావు, రాజారావు, రాంప్రసాద్, పులిరాజు, రామారావు, జగన్నాథంపడాల్ పాల్గొన్నారు.

వీఆర్ పురం: చితరేగుపల్లిలో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేని ప్రజాదరణ వైఎస్సార్‌సీపీకి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో రంపచోడవరం ఎమెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనుజారాణిలను అత్యధిక మెజార్టీలతో గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. మాజీ కన్వీనర్ పాడియం గోపాల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, సర్పంచ్ పిట్టా రామారావు, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు గంగులు, ముత్యాల శ్రీనివాస్, ముత్యాల మురళి, జయరాజ్, సీతారాం, ముత్యాలరావు, నరేష్, ఉమ, జయరాజ్, చిన రాజారావు, శ్రీధర్, నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లోతేరులో ప్రచారం చేస్తున్న నాయకులు

నామినేషన్‌కు తరలిరండి

హుకుంపేట: మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో అరకు ఎన్నికల పరిశీలకురాలు శోభ హైమావతి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం నామినేషన్ వేస్తున్నారని, ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంలు గెలుపే లక్ష్యంగా నాయకులు పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు అందరూ కష్టపడాలన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, మండల గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిన్నబ్బి, మాజీ సమన్వయకర్త చెట్టి అప్పాలు, మాజీ జెడ్పీటీసీ కొర్ర కాసులమ్మ, నాయకులు నైని సత్తిబాబు, జన్ని సింహాచలం, రాజారావు, చిన్నేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.



హుకుంపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో అరకు ఎన్నికల పరిశీలకులు శోభ హైమావతి

గ్రామ వలంటీర్ల రాజీనామా



పంచాయతీ సిబ్బందికి రాజీనామా పత్రాన్ని ఇస్తున్న గ్రామ వలంటీర్ రాజశేఖరరెడ్డి



బూదరాళ్లలో రాజీనామా పత్రాలను చూపిస్తున్న గ్రామ వలంటీర్లు

వై.రామవరం: మండలంలో పి.యర్రగొండ గ్రామ సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్ పల్లాల రాజశేఖరరెడ్డి శనివారం తన విధులకు రాజీనామ చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీరు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు గ్రామ వలంటీర్లపై చేసిన అతి దారుణమైన వ్యాఖ్యలు భరించలేకే రాజీనామ చేశామన్నారు. ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించి రాజీనామా చేసిన వలంటీర్లంతా జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబు తగిన బుద్ధి చెబుతామన్నారు.

కొయ్యూరు: మండలంలో శనివారం మూడు సచివాలయాల పరిధిలో 20 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.బూదరాళ్ల, బంగారంపేట, ఆడాకుల సచివాలయాల నుంచి రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీమానా చేశామన్నారు. వలంటీర్లుగా పేదలకు సేవ చేసే అవకాశాన్ని జగనన్న ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాంటి అవకాశం అందరికి రాదన్నారు. ఇకపై వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం బైక్‌పై ప్రచారం

- వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని
- శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకూ విస్తృతంగా కాన్వసింగ్

అనకాపల్లి: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ శ్రీకాకుళం పట్టణానికి చెందిన జి.సన్యాసిరావు తన బైక్‌పై ఊరూవాడా విస్తృతంగా ప్రచారం చేశారు. 15 రోజుల కిందట శ్రీకాకుళం నుంచి బయలుదేరిన ఆయన విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి జిల్లాల్లో ప్రచారం చేశారు. తిరుగుప్రయాణంలో అనకాపల్లి నియోజకవర్గంలో కశింకోట మండలం చింతలపాలెంలోని ×మేమంతా సిద్ధం× బహిరంగ సభ ప్రాంగణానికి ఆయన తన ద్విచక్ర వాహనంపై శనివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ప్రచారం చేస్తూ చింతలపాలెం బహిరంగ సభకు వచ్చినట్టు చెప్పారు.



జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అవ్వాలని బైక్‌పై ప్రచారం చేస్తున్న సన్యాసిరావు

జడేరులో వైద్య శిబిరం-50 మందికి వైద్య సేవలు

గంగవరం: మండలంలోని జడేరు గ్రామలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 50 మందికి డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్య సేవలంచి, అవసరమైన 18 మందికి రక్త పరీక్షలు చేసినట్టు చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారం జడెరు గ్రామంలో వైద్య శిబిరం జరుగుతుందని ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ ప్రతినిధులు శ్రీనివాస్ ,సిబ్బంది పాల్గొన్నారు .



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నేడు

రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్‌లో గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఆదివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్స్‌పాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 5వ తరగతి ప్రవేశంతో పాటు 6, 7, 8, 9 తరగతుల్లో గల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. మొత్తం 212 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా సారె ఊరేగింపు

మాడుగుల రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా వీరవల్లి అగ్రహారంలో శనివారం స్వామివారి సారె ఊరేగింపు నిర్వహించారు. భక్తులు తయారు చేసిన వివిధ రకాల మిఠాయిలు, పండ్లను ఊరేగించి స్వామి వారికి నివేదించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

వీఆర్ పురం: మండలంలోని అన్నవరం గ్రామంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ శనివారం పర్యటించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. ఎన్నికల్లో అర్హులంతా ఓటు వేయాలన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ మడకం రామకృష్ణ , సిబ్బంది తదితరులున్నారు.



అన్నవరంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ప్రిన్సిపాల్ మోహన్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొయ్యూరు: గురుకుల పాఠశాలలో 2004–2005లో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు శనివారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి గణితం ఉపాధ్యాయులుగా పనిచేసిన మోహన్ నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్ కావడం ఆనందంగా ఉందని పలువురు చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.